

ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవు

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో డెలివరీలు ఎలా జరుగుతున్నాయని, వాటి సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర-చోడవరం: ఏ.పీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచే స్తున్న ఆరోగ్య కార్యకర్తలు (హెల్త్ అసిస్టెంట్ల) ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా సంఘ అధ్యక్షుడు అనంతపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఓ పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ రెండు రాష్ట్రాల్లో కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో సుమారుగా 950 మంది ఆరోగ్య కార్యకర్తలు పట్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలపై సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు)ను ఆశ్రయించగా 2024 డిసెంబర్ 18న 'స్టేటస్ కో' ఆర్డరు వేసినప్పటికీ, నేటి వరకు ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోకుండా, వారి కుటుంబాలను వీధిపాలు చేస్తున్నారని సంఘ నేత ఆరోపించారు. 2002 ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిన ప్రభుత్వం చే క్లియర్ వేకెన్సీ తో నియమింపబడి ఆరోగ్య కార్యకర్తలుగా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సర్వోన్నత న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూ ప్రభుత్వం తక్షణమే ఆరోగ్య కార్యకర్తలు (హెల్త్ అసిస్టెంట్లు)ను విధుల్లోకి తీసుకోవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

వీఆర్వోలకు డైరీ లు పంపిణీ

విశాలాంధ్ర- కె.కోటపాడు: ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ 2025వ సంవత్సరం క్యాలెండర్లను, డైరీలను అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎస్.టి.రామకాసు , ప్రధాన కార్యదర్శి ఎస్.అనంతరామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పూడి సురేష్, అనకాపల్లి డివిజన్ అధ్యక్షుడు గణేష్ లు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ కు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తహసీల్దార్ శ్రీమతి పి.భాగ్యవతి ని అభినందించి సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ జిల్లా కోశాధికారి కె.గౌరీశంకర్, మండలంలోని విఆర్వోలు జ్యోతి, విజయశ్రీ, శివ, గంగునాయుడు, వెంకటేష్, నాయుడు, జగదీశ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

20 నుండి పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర-సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు సబ్బవరం మండలంలోని అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సబ్బవరం ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. కె. ఉషాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామని చెప్పారు. గ్రామాలలో ఉన్న గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకా కార్యక్రమాలు నిర్వహించి అనారోగ్యంగా ఉన్న, ఎదకురాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామన్నారు. మండలంలో రోజుకు 2 గ్రామాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకుడు, రైతు సేవా కేంద్రం లోని పశు వైద్య సహాయకులతో 2 బృందాలు ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలలో నిర్వహించే కార్యక్రమాల వలన గ్రామాలలో ఉన్న పాడి పశువులు, గొర్రెలు మేకల ఉత్పాదక శక్తి పెరుగుతుందని, పశు వులలో ఈతకు ఈతకు మధ్య దూరం తగ్గించి ఏడాదికి ఒక దూడ పొందవచ్చని, కాబట్టి పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయితీలు, అంగన్వాడి కేంద్రాలు పరిశీలించిన ఈఓపిఆర్డి



విశాలాంధ్ర -పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీలను, అంగ న్వాడి కేంద్రాలను ఈఓపిఆర్డి సిహెచ్. చంద్రశేఖర రావు పరిశీలించారు. సత్యవరం, మంగవరం, నామవరం పంచాయితీ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమిత్వ సర్వే గురించి సిబ్బందిని ఆరా తీశారు. అలాగే మంగవరం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేయగా అక్కడ కేంద్రానికి తాళం వేసినట్లు గుర్తించారు. కేంద్రంలో కిశోర బాలికలు ఉన్నా లేకపోయినా సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్వాడి కేంద్రాన్ని తెరిచి ఉంచాలని అంగన్వాడి కార్యకర్తకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నకిలేటి రాము, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడివాడలో పైడితల్లమ్మవారి తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో మామిడివాడ గ్రామంలో మంగళవారం శ్రీ పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు తెల్లవారుజామున నుండే అమ్మవారికి కానుకలు సమర్పించుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న వారిలో నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్,సీనియర్ టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు,మాజీ ఎమ్మెల్యేలు యువి రమణమూర్తి రాజు(కన్నబాబు),కరణం ధర్మశ్రీ,రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి దూళి రంగ నాయకులు, ఎంపీపీ శ్రీనుబాబు,జెడ్పీటీసీ దూళి నాగరాజు, ఎంపిటిసి కలవలపల్లి సన్యాసిరావు, మాజీ సర్పంచ్ నెట్టిం సత్యనారాయణ, స్థానిక కూటమి నాయకులు బండా గోవిందరావు, సేనాపతి నాగేశ్వరరావు,బద్ది శ్రీనివాసరావు,బద్ది మహేష్,బొడ్డేటి భాస్కరరావు, దాచేపల్లి సత్రయ్య శెట్టి,యలమంచిలి మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్య దొర,మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు,అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. భక్తులు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-అచ్యుతాపురం : నేడు మండల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ కే రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . 11 కెవి విద్యుత్తు లైన్ల పనులు చేస్తున్నందున మండలంలో పలు గ్రామాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు . వినియోగదారులు సహకరించాలని కోరారు.

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్

జాయింట్ కలెక్టరు జాహ్నవి

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్: అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం విజయవంతం చేయాలని జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. శనివారం నిర్వహించే "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్" కార్యక్రమంపై సంబంధిత అధికారులతో జాయింటు కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలలో ఒక శనివారం "స్వచ్ఛత" కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రతి నెలలో మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ నెల 18వ తేదీన కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో శనివారం నిర్వహించే కార్యక్రమంలో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది, ప్రజలు అంకిత భావంతో భాగస్వామ్యులు కావాలని ఆమె తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సంబందించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని, మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలన్నారు. పంచాయితీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక - పట్టణాభివృద్ధి శాఖలు కీలక భూమిక పోషించాల్సి ఉందని, అందుకు తగిన విధంగా ఆయా శాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యంతో మానవహారాన్ని నిర్వహించాలని, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ప్రతి అంశాన్ని యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో జనవరి మాసంలో "న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్" థీమ్ తో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమలో భాగంగా జిల్లాలో గల కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల పరిసరాలను శుభ్రం చేయాలని, గ్రామాలలో అపారిశుధ్య ప్రదేశాలను గుర్తించి శుభ్రంచేయాలని, చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి వసతుల క్లోరినేషన్, మురుగు కాలువలు శుభ్రం చేయడం, చెరువుల వద్ద చెత్త లేకుండా చూడటం, సామాజిక మరుగుదొడ్లను గుర్తించడం - ఉపయోగంలోకి తీసుకురావడం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించేలా అవగాహన కల్పించడం, ఇంటింటా తడిచెత్త - పొడిచెత్త ప్రక్రియ కొనసాగించడం, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి పనులను చేపట్టాలని జాయింటు కలెక్టరు ఆదేశించారు. ఈ నెల 18వ తేది నుండి వచ్చే 12 నెలల పాటు నెలకు ఒక థీమ్ తో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని జాయింటు కలెక్టర్ తెలిపారు. జనవరి మాసంలో "న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్" థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో "సోర్సు - రిసోర్సు" , మార్చిలో "అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ %-% ప్రమోట్ రీయూజబుల్స్", ఏప్రిల్‌లో "ఇ-చెక్, మే లో "నీరు-మీరు", జూన్ లో "బీట్ ది హీట్", జులై లో "ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్", ఆగస్టు లో "మాన్ సూన్ హైజినిక్", సెప్టెంబరు లో "గ్రీన్ ఏ.పి", అక్టోబరులో "క్లీన్ ఎయిర్", నవంబరులో "పర్సనల్ అండ్ కమ్యునిటీ హైజిన్", డిశంబరు మాసంలో "ఆపర్చునిటీస్ ఇన్ ఎన్విరాన్మెంట్" థీమ్ లతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో సామాజిక భాగస్వామ్యం (కమ్యునిటీ ఎంగేజ్ మెంట్) ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంను సందర్శించిన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విద్యాలయము ను ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కులపతి శ్రీ ధీరజ్ సింగ్ ఠాకూర్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు విశ్వావిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ జనరల్ కౌన్సిల్ మీటింగ్ కు అయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుమారు 4 గంటల పాటు విశ్వవిద్యాలయంలో గడిపి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో సంభాషిస్తూ వారి సమస్య లగురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన రెండు బాలికల వసతి గృహములను అయన ప్రారంభించారు. విద్యార్థుల భోజన సదుపాయాలు గురించి సమీక్షించి, వాటిని ఎలా మెరుగు పరచాలో తెలుపుతూ విద్యార్థుల మెస్ కమిటీ పనితీరును తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయ అధికారులకు సూచించారు. హాస్టల్‌లోని ప్రతి అంతస్తు ను సందర్శించి బాత్ రూమ్ లలో ఆధునిక ఫిట్టింగ్స్ ,వాషింగ్ మెషిన్, డ్రైయ్యర్ లాంటి సదుపాయములు కల్పించాలని ఆదేశిస్తూ విద్యార్థులు కూడా తమకు కల్పించిలిన సౌకర్యాల ను సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల క్రీడా సౌకర్యాలను పరిశీలించి, నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ ఆడిటోరియం ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి ఎస్.జయ సూర్య పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విశ్వచంద్ర నాథ్ మాదాసు, చీఫ్ వార్డెన్స్ భాగ్యలక్ష్మి, జోగినాయుడు, నాగేశ్వరావు, షేర్లి మరియు అధ్యాపకేతరులు తదితరులు పాల్గొన్నారు.

21న ఎన్ఆర్ఈజీఎస్ ప్రజా వేదిక

విశాలాంధ్ర-యస్. రాయవరం : ఈనెల 21వ తేదీన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల స్థాయి ప్రజావేదిక జరగనున్నట్లు ఏపీవో ఎరకయ్య వెల్లడించారు. గత సంవత్సరం గ్రామాల్లో జరిగిన ఉపాధి పథకం ద్వారా నిర్వహించిన పనులు ఆడిట్ నిర్వహించడం జరిగిందని మండల స్థాయిలో ప్రజా వేదిక జరుగుతాదని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు సమక్షంలో జరిగే ఈ ఆడిట్ లో ప్రజాప్రతినిధులు అధికారులు హాజరుకావాలని కోరారు.

వయోజనుల అక్షరాస్యతకై 'ఉల్లాస్'

అనకాపల్లి డిఆర్‌డి శచీదేవి

విశాలాంధ్ర-సబ్బవరం: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశ పెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమం గా అమలుచేయాలని అధికారులను అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఏ శచీదేవి. ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంపై జిల్లా స్థాయిలో వయోజన విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలో గల అందరూ ఎంపీడీవో లకు, వెలుగు ఏపీఎం లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి విచ్చేసిన టిసిఎస్ రాష్ట్ర ఇన్చార్జి విశ్వనాథ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం అవసరాన్ని గురించి వివరించారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ నోడల్ అధికారి ఎస్. మంజు లవాణి, వయోజన విద్య అనకాపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ డి.చిన్నకృష్ణ ఆయా శిక్షణ పొందిన వారికీ పలు సూచనలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె.శ్రీనివాస్, వివిధ మండలాల ఎంపీడీవోలు, డి ఆర్ డి ఏ ఏపీఎం లు పాల్గొన్నారు.

20 నుండి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర- వి.మాడుగుల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు మాడుగుల, చీడికాడ మండలాలలోని అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామని, గ్రామాలలో ఉన్న గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకా కార్యక్రమాలు నిర్వహించి అనారోగ్యంగా ఉన్న, ఎదకురాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతీ మండలంలో రోజుకు 2 గ్రామాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకుడు, రైతు సేవా కేంద్రం లోని పశు వైద్య సహాయకులతో 2 బృందాలు ఏర్పాటు చేయడమైం దన్నారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలలో నిర్వహించే కార్యక్రమాలవలన గ్రామాలలో ఉన్న పాడి పశువులు, గొర్రెలలు, మేకల యొక్క ఉత్పాదక శక్తి పెరుగుతుందని, పశువులలో ఈతకు ఈతకు మధ్య దూరం తగ్గించి ఏడాదికి ఒక దూడ పొందవచ్చని, కాబట్టి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలియజేశారు.

వైసీపీ నుంచి జనసేనలోకి వలసలు

విశాలాంధ్ర-అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో వైసీపీ నుంచి జనసేనలోకి చేరారు . శుక్రవారం మాటూరు గ్రామంలో వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ , వార్డ్ మెంబర్లుతో పాటు సుమారు 200 మంది జనసేన పార్టీలోకి చేరారు . వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు . అనంతరం గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో జనసేన మండలపార్టీ అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు , మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు , ద్వారపురెడ్డి బాబ్జి , కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

నవోదయ ఎంట్రన్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర

విశాలాంధ్ర-నక్కపల్లి: శనివారం ఉదయం స్థానిక రెసిడెన్షియల్ స్కూల్ కేంద్రంగా ఆరవతరగతిలో ప్రవేశాలకొరకు నిర్వహించనున్న నవోదయ ప్రవేశపరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర తెలియజేశారు. ఈ పరీక్ష ఉదయం గం 11-30 నుండి గం1-30 వరకు జరుగుతుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఉదయం పదిగంటలకే హాజరుకావాలన్నారు.పరీక్షాకేంద్రంలో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లుకు అనుమతిలేదన్నారు తాగునీరు,విద్యుత్ వైద్యం వంటి సదుపాయాలతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.పరీక్ష జరిగే సమయంలో ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు వ్రాయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని అన్నారు. శుక్రవారం పరీక్షాకేంద్రంలో ఏర్పాట్లుపై జిల్లాకలెక్టర్ ఆదేశాలమేరకు చీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర తో స్థానిక మండలవిద్యాశాఖాధికారులు కె.నరేష్, వేమగిరి నూకరాజులు చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అది పులి కాదు నక్క : ఫారెస్ట్ అధికారులు

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో గొరపూడి అప్పన్నపాలెం నేవీ కాలనీ వద్ద పులి సంచరిస్తుందన్న వదంతు ప్రజల్లో అలజడి సృష్టించింది.నిత్యం అటువైపుగా వేలాదిమంది ప్రజలు తమ తమ అవసరాలపై తిరుగుతూ ఉండే ప్రాంతంలో పులి సంచరిస్తుందంటూ గురువారం ఆడియో రికార్డులు,ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో స్థానికంగా ఉన్న ప్రజలు భయభ్రాం తులకు గురయ్యారు.ఈ క్రమంలో గ్రామస్తులు నుంచి గురువారం రాత్రి సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ ఆదేశాలతో సెక్షన్ అధికారి రమణ శుక్రవారం తమ సిబ్బంది లావణ్యతో కలిసి రంగంలోకి దిగి,అసలు విషయం బయటపెట్టారు.ఈ తరుణంలో మాట్లాడుతూ నేవీ కాలనీ, అప్పన్నపాలెం గొరపూడి కొండ సమీపంలో కనిపించింది పులి కాదని తేల్చిచెప్పారు. అది నక్కే మాత్రమే నని నిర్ధారించారు. ఆ ప్రాంతాలను పరిశీలించినప్పుడు పులి కాలి ముద్రలు లేవని, పులి కాలి ముద్ర అయితే కనీసం 18 సెంటీమీటర్లు వరకు ఉంటుందని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్‌లో జూమ్ చేసి వీడియో తీయడం వల్ల అది పులిలాగా కనిపించిందని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. అటవీ అధికారులు స్పష్టం చేయడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

లంకెలపాలెంలో రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అనకాపల్లి: లంకెలపాలెంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు అధ్యక్షతన లంకెలపాలెంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రణ అనే విషయంపై కోడుగంటి గోవిందరావు భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.ఇటీవల లంకెలపాలెంలో తీవ్రంగా గాయపడి మెడికోవర్ ఆసుపత్రిలో చావుబ్రతుకుల మధ్య కొట్టుకుంటున్న చిన్నయ్యశెట్టిని ప్రభుత్వం వైద్య ఖర్చులు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. లంకెల పాలెంలో తరచూ ప్రమాదాలు విశాఖ నుండి అనకాపల్లి వస్తున్న రోడ్డులో జరుగుతున్నాయి అని, దానికి కారణం లంకెలపాలెంలో విశాఖ-అనకాపల్లి వచ్చేదారి ఎగువ నుండి దిగువకు ఉండటమే అని, అనకాపల్లి నుండి విశాఖకు వెళుతున్న దారిలో గానీ, పరవాడ నుండి హైవేని దాటుతున్నప్పుడు గాని ప్రమాదాలు జరగటం లేదని. అత్యధికంగా ప్రమాదాలు సిగ్నల్ పాయింట్ వద్ద సిగ్నల్ పడినప్పుడు అదే దారిలో వెనుక నుండి వస్తున్నటువంటి పెద్ద వాహనాలు చిన్న వాహనాల మీదకు ఎక్కటం మూలంగానే జరుగుతున్నాయి. దీనికి కారణం ఆ ప్రాంతంలో వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల గత శనివారం అనగా ఈనెల 11వ తేదీన యువ న్యాయవాది చిన్నయ్యశెట్టి వైజాగ్ నుండి వస్తు లంకెలపాలెం జంక్షన్ నందు రెడ్ సిగ్నల్ పడిన కారణంగా ఆయన బైకును నిలుపుదల చేసి గ్రీన్ సిగ్నల్ కొరకు వేచి ఉన్న సమయంలో అదే దారిలో వెనక నుండి వస్తున్నటువంటి ఆర్టీసీ బస్సు సిగ్నల్ పాయింట్ని గమనించకుండా వచ్చి బలంగా గుద్దటం మూలంగా ఆ న్యాయవాది ఎగిరిపడి తీవ్ర గాయాల పాలైనాడు ప్రస్తుతం ఆయన మెడికోవర్ ఆసుపత్రిలో జీవన మరణాల మధ్య కొట్టుకుంటూ వైద్యం పొందుతున్నాడు అని ఆ న్యాయవాది బంధువుల సమాచారం మేరకు ఆరోగ్యశ్రీ క్రింద వైద్యం జరగటం లేదని. ఆయన కుటుంబ సభ్యులు వైద్యం చేయించేందుకు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలో చాలానే ఆ లంకెలపాలెం సిగ్నెల్ పాయింట్ దగ్గర జరిగినవి అని గుర్తుచేసుకున్నారు. అక్కడ జరిగే ప్రతి ప్రమాదము విశాఖపట్నం వైపు నుండి దిగువకు వస్తున్న సమయంలోనే ఆ లంకెలపాలెం సిగ్నల్ పాయింట్ దగ్గరనే జరుగుతున్నాయి అని కనుక ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి ప్రజల తాలూకా జీవితాలను దృష్టిలో ఉంచుకొని అక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణానికి పూనుకోవాలని అందరూ కలిసి ఏకవాఖ్య తీర్మాణంతో డిమాండ్ చేశారు. అలాగే తీవ్ర గాయాలతో వైద్యం పొందుతున్న న్యాయవాది చిన్నయ్యశెట్టి వైద్యఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేసారు. అధికారులు ఆ లంకెలపాలెం కోడలిలో విశాఖపట్నం నుండి వస్తున్న వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు తగిన పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు, సిపిఐ జిల్లా సహాయక కార్యదర్శి రాజాన దొరబాబ, రైతు సంఘం నాయకులు కోరుబిల్లి శంకర్రావు దేవుడు బాబు, సిపిఎం పార్టీ నాయకుడు కర్రి అప్పారావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ స్థానిక జిల్లా కార్యదర్శి శేఖర్ మంత్రుల సాయి వెంకట లక్ష్మణ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులను పస్తులుంచిన కూటమి నేతలు, ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ గో బ్యాక్

- మాటలకే పరిమితమైన ఎమ్మెల్యే, ఎం.పి.
- అధికారంలోకి వస్తే మద్దతు ధర ఇస్తామన్న నేతలు నేడు ముఖం చాటేస్తున్నారు
- ఏ.పీ. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

విశాలాంధ్ర-చోడవరం : కార్మికులు కర్షకులను సంక్రాంతి పండుగ పూట పస్తులు ఉంచిన ఎం.పీ, ఎమ్మెల్యే, ఫ్యాక్టరీ యాజమాన్యం గో బ్యాక్ అంటూ ఏ.పీ. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. పాలకులు, అధికారులు కార్మిక కర్షకుల పట్ల నిరంకుశ విధానాలపై రైతు సంఘం కార్యదర్శి రెడ్డిపల్లి శుక్రవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. గోవాడ సుగర్స్ యాజమాన్యం నిరంకుశ వైఖరితో అందరికీ తీపిని పంచే గోవాడ ఫ్యాక్టరీ ని నమ్ముకున్న కార్మికులు, కర్షకుల పరిస్థితి నేడు అధ్వానంగా తయారయిందని ఆరోపిస్తున్నారు. రేయనక పగలనక ఆరుగాలం కష్టపడిన రైతాంగం కార్మికులకు కనీసం బకాయిలు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వ ఎంపీ రమేష్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, జనసేనాని పి. వి.ఎస్.ఎన్.రాజు ల తీరు సిగ్గుచేటు అన్నారు. మాటల తూటాలతో రైతాంగాన్ని, కార్మికులను నమ్మబలికే ప్రసంగాలు తప్ప, రైతాంగానికి భరోసా కల్పించే విషయాలు లేవని తెలిపారు. గడిచిన మూడేళ్ళుగా చనిపోయిన సభ్య రైతులకు కనీసం నష్టపరిహారం చెల్లించకపోవడం, రైతుల దురదృష్టమా, యాజమాన్యం మొండి వైఖరియా అని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో జరిగిన, జరుగుతున్న అవకతవకలు పై సి.బి.ఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. సభ్య రైతులకు, కార్మికులకు చెల్లించ వలసిన బకాయిలు, గ్రాట్యుటీ, జమ చేయవలసిన పి.ఎఫ్ బకాయిలుపై స్పష్టత ఇవ్వక పోవడం దుర్మార్గమన్నారు. టి.డి. పి.,జనసేన అధికారంలోకి వస్తే చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.4000 ఇస్తామని, గత మహాజన సభలో మాటిచ్చి అధికారంలోకి వచ్చిన నాయకుల హామీలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చాక ఒక మాట చెప్పిన అధికార పక్ష కూటమి నాయకులు రైతాంగం పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రూ.89 కోట్ల నిధులు ఫ్యాక్టరీకి ఇచ్చిందని తెలిపారు. సభ్య రైతులకు, కార్మికులకు చెల్లించవలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. రైతులు, కార్మికుల బకాయిలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరుకు మద్దతు ధర ఇవ్వక పోవడమే కాకుండా సంవత్సరాలు తరబడి పిఎఫ్ డబ్బులు కట్టక పోవడం దారుణమని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో అవినీతి రాజ్యమేలుతుందని గతంలో చాలాసార్లు అధికారులు విచారణ జరిపినా చర్యలు తీసుకోక పోవడంతో అవినీతి దారుణంగా పెరిగి పోతుందని తెలిపారు. రిటైర్డ్ అయిన కార్మికులకు పిఎఫ్. గ్రాట్యూటీ, కార్మికులు కర్షకులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని, పండగ పూట కార్మికులు కర్షకులను పస్తులుంచి బకాయిలు చెల్లించడం చేతగాని ఫ్యాక్టరీ ఎం.డి, ఎం.పీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎండి లకు వినతిపత్రం అందజేశారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యే, ఎండి కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ చంద్రశేఖర్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, గూనూరు వరలక్ష్మి, జిల్లా కార్యదర్శి, ఎస్ వి నాయుడు డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొనడం జరిగింది

104 వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ భీశెట్టి గంగా అప్పలనాయుడు

విశాలాంధ్ర-మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో 104 వాహనాలు ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని,గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగా అప్పలనాయుడు కోరారు.మండలంలో మూలా పేట గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసు కోవాలని అన్నారు.గ్రామంలో అవసరమైన వారందరికీ షుగరు,బీపీ,ఇతర వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్,యామిని,ఏఎన్ఎం రమణి,మెడికల్ సిబ్బంది,ఆశ వర్కర్,గ్రామస్తులు పాల్గొన్నారు. ..

నేడు వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

విశాలాంధ్రబి అనకాపల్లి: 171 సంవత్సరాల చరిత్ర కలిగిన వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వరి మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు., ప్రతి ఏడాది వలె ఈ ఏడాది కూడా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు సహాయ సహకారాలతో గౌరీ పరమేశ్వర ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు తెలియజేశారు.

అమ్మవారి చరిత్ర,:

ప్రఖ్యాతిగాంచిన వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వరులు మహోత్సవం.
సుమారు 170 సంవత్సరాలు క్రితం స్థానిక వేల్పుల వీధిలో వేల్పుల రామారావు కుటుంబానికి చెందిన స్థలంలో వేల్పుల ఆదెమ్మ -గౌరమ్మ అనే ఇరువురు బాలికలు బాల గౌరమ్మ ను ప్రతిష్టించి పూజలు నిర్వహించే వారు. తదుపరి వీధి ప్రజలు అందరూ కలిసి చిన్న పండగలా చేసేవారు.దరిమలా నాటి వీధి పెద్దలు వేల్పుల కుటుంబం కలిసి శ్రీ వాకాడ దాలప్ప ఆధ్వర్యంలో జిల్లా ఉత్సవంగా పేరు పొందింది. వీరు సుమారు 50 సంవత్సరాలు

నిర్వహించి తదుపరి వయోభారంతో 1973సంవతసరం లో నాటి వీధి పెద్దలు యువకులుకు నిర్వహణ బాధ్యతలు అప్పగించిరి తదుపరి కీర్తిశేషులు రౌతు ఆదినారాయణ నాటి యువకులు సారథ్యంలో రాష్ట్ర ఉత్సవముగా వెలుగొందుతుంది 2005 లో రోడ్లు విస్తరణ లో పాత గుడి దెబ్బతిన్న కారణంగా స్థానిక ప్రజలు వీధి భక్తులతో 2022లో సుందర ఆలయమును నిర్మించినట్లు తెలిపారు.

పండగ రోజు

శనివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి రథంపై ఊరేగింపు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు అమ్మవారి దర్శించుకుంటారని ఆయన తెలియజేశారు. ఏడాది భారీ స్టేజ్ ప్రోగ్రాములు, భారీ విద్యుత్ అలంకరణ, మందు గుండు సీతారామయ్య గారి అతి భారీ బాణాసంచా హంగామా ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతుందని తెలియజేశారు. నేల వేషాలు, పలు సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, భక్తులు సహకారంతో ఉచిత ప్రసాదం పంపిణీ జరుగుతుంది ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పులగణేష్, ఉత్సవకమిటీ సభ్యులు వేల్పుల వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. ..

సభ్యత్వ నమోదులో కే కోటపాడు ఫస్ట్

విశాలాంధ్ర-కే కోటపాడు: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో కే కోటపాడు మండలం అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయించడమే కాకుండా ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్న ఘనత ఈ మండలానికి చెందుతుంది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సభ్యత్వాల నమోదుపై నిరంతరం సమీక్షిస్తూ అత్యధికంగా చేసిన పంచాయతీలకు పురస్కారాలు అందజేస్తానని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అతి చిన్న నియోజకవర్గం , అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న మాడుగుల , సభ్యత్వ నమోదులో ఇతర నియోజకవర్గాలకు పోటీగా నిలిచింది. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో 46,354 సభ్యత్వాలను నమోదు చేయించడం అంటే ఆషామాషీ కాదు. పార్టీ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఆలోచనలో నుంచి పుట్టిన పలు కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తలు ఆకర్షితులయ్యారు. పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువులకు ఆర్థిక సహాయం , ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా ఉచిత విద్య , ఉపకార వేతనాలు అందించడం తదితర కార్యక్రమాల ద్వారా కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకున్నారు. అందువల్లనే రాష్ట్రంలో పార్టీ సభ్యత్వం కోటి దాటింది. ఈనెల 12 వరకు మండలాల వారి సభ్యత్వాలు నమోదు పరిశీలిస్తే నియోజకవర్గంలో మాడుగుల మండలం 12669 , కే కోటపాడు 14901, దేవరపల్లి 9875, చీడికాడ 8909 సభ్యత్వాలు నమోదు పూర్తయినట్లు ఎమ్మెల్యే బండారు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో పంచాయతీల వారీగా ప్రథమస్థానం కే కోటపాడుకు దక్కగా రెండో స్థానం అదే మండలం చౌడువాడకు దక్కింది. ఇక మాడుగుల మూడో స్థానానికి పరిమితం అయింది. మాడుగుల నియోజకవర్గ చరిత్రలో ఇన్ని వేల సభ్యత్వాలు నమోదు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఇదే స్ఫూర్తితో మండల గ్రామస్థాయి నాయకులు పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విశేషంగా తీసుకు వెళ్లాలని ఎమ్మెల్యే బండారు కోరారు.

పేటసూదిపురంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలో పేటసూదిపురం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలోని తీర్థం జరగడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి తిలకించారు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరణం హేమలత, టిడిపి నాయకులు కరణం శివ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అగ్రహారంలో చండీ మహాయాగం ప్రారంభం

విశాలాంధ్ర-యస్. రాయవరం : మండలంలో కొత్త అగ్రహారం గ్రామంలో చండీ పూర్వక గాయత్రీ మహాయాగం ప్రారంభమైంది. లోక కళ్యాణం కొరకు పిఠాపురం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఇంద్రగంటి నారాయణ సోమయాజులు ఆధ్వర్యంలో ప్రారంభమైన కోటి కుంకుమార్చన శ్రీరామ రుద్ర సహస్ర చండీ పూర్వక గాయత్రీ మహాయాగం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 17వ తేదీ నుండి ప్రారంభమైన ఈ యాగం 27వ తేదీ వరకు జరుగుతాదని ప్రతిరోజు శ్రీ సీతారాముల కళ్యాణం అదేవిధంగా మహిళల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి పురోహితులు వచ్చి ఈ యాగంను వేదమంత్రాలతో చేస్తున్నట్లు వెల్లడించారు.

స్వయం భూ గణపతి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో లక్ష్మి గణపతి హోమం

విశాలాంధ్ర-చోడవరం : రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్య సిద్ధి గణపతి దేవస్థానంలో పుష్య బహుళ చవితి సందర్భంగా శుక్రవారం భక్తులు, మహిళలు, పుర ప్రముఖులు విద్యార్థులు చే సామూహికంగా లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. పుష్య మాసం, ఉత్తరాయణం సందర్భంగా వేకువ జామునే భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అథర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం సామూహిక లక్ష్మి గణపతి హెూమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. అనంతరం హెూమం లో పాల్గొన్న దంపతులు, భక్తులకు దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వేద పండితులు ధవళ ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వసుమర్తి సాంభశివరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ డొంకమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం

గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావులమ్మపాలెం గ్రామంలో శ్రీ డొంకమాంబ పేరంటాలు తీర్థ మహోత్సవం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి పేరంటాలకు ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పేరంటాలు అమ్మవారికి పసుపు ,కుంకుమ నివేదించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి , వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్ , మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు అలాగే గ్రామ పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొని పేరంటాలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ప్రతి సంవత్సరం ముక్కోనుమ వెళ్లిన మరుసటి రోజు న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తీర్థం సందర్భంగా సాయంత్రం కోలాటాలు, స్వామి గరిడీలు, చిటికెలు భజనలుతో భారీమందుగుండు సామగ్రితో, తీన్మార్ డప్పులతో వైభంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు సహకారంతో డాన్స్ బేబీ డాన్స్ సంస్కృతిక కార్యక్రమం పలువుని బాగా ఆకట్టుకున్నది. అలాగే ఆశకపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల తీర్థం గ్రామ సర్పంచ్ కర్రీ నరిసింగరావు, ఎంపీటీసీ కర్రీ అప్పారావు , గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటల నుండి శ్రీ వెంకట నూకమాంబ కళా నాట్య మండలి వారిచే గ్రామ సర్పంచ్ కర్రీ నరసింగరావు దర్శకత్వంతో రాజు సింహం అను సాంఘిక నాటకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సబ్బవరపు దేముడుబాబు, సబ్బవరపు నరసింహమూర్తి, సబ్బవరపు శ్రీనివాసరావు, గొంప ముత్యాలనాయుడు, సబ్బవరపు చిన్నంనాయుడు, మేడపిరెడ్డి జగన్నాథం, బర్ల బాబి, సబ్బవరపు కృష్ణ ,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించండి.. ఫ్యాక్టరీ మనుగడకు సహకరించండి

సుగర్స్ కార్మికులకు ఎమ్మెల్యే రాజు విజ్ఞప్తి

విశాలాంధ్ర-చోడవరం : గోవాడ సుగర్స్ లో గడిచిన కొద్ది రోజులుగా కార్మికుల ఆందోళన పట్ల దిగివచ్చిన చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సమ్మె విరమించి ఫ్యాక్టరీ మనుగడకు సహకరించాల్సిందిగా కార్మికులను కోరారు. గోవాడ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులతో శుక్రవారం ఆయన అత్యవసరంగా సమావేశం అయ్యారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ, సంక్రాంతి పండుగ పూట పస్తులు ఉంచిన గోవాడ సుగర్స్ యాజమాన్యంపై విధులను బహిష్కరించి కార్మికులందరూ సామూహికంగా ఆందోళనలకు దిగడం, పరిస్థితులు చేజారుతున్న వేళ ఎమ్మెల్యే రాజు కార్మికులను ఊదరగొట్టే ప్రయత్నం ప్రారంభం చేశారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కార్మికులు పలుమార్లు యాజమాన్యంతో చర్చలు జరపడం, యాజమాన్యం ఇచ్చిన మాట నిలబెట్టుకో పోవడంతో ఎట్టకేలకు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పరిస్థితి చేయి దాటిపోతున్న తరుణంలో యాజమాన్యాన్ని రక్షించే రీతిలో స్థానిక ఎమ్మెల్యే రాజు కార్మికులతోను, సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా జరిగిన చర్చల్లో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు, ఫ్యాక్టరీకి రావలసిన బకాయిలు వంటి వాటి కోసం చర్చించి ఫ్యాక్టరీకి చెల్లించాల్సిన వారితో ఫోన్లో మాట్లాడి కొంతమేర అయినా సర్దుబాటు చేయాలని ఎమ్మెల్యే వారిని కోరారు. త్వరలో జీతం బకాయలు చెల్లించే ఏర్పాట్లు చేస్తామని సమ్మె విరమించాలని ఎమ్మెల్యే కార్మిక వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులు కూడా ఎం.డి పై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం నాయకుడు కె. భాస్కర్ రావు మాట్లాడుతూ కార్మికులకు 6 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని , మేనేజ్మెంట్ వారిని ఎన్నిసార్లు కోరిన పట్టించుకోవడం లేదని కనీసం కోటి రూపాయలు చెల్లిస్తామని చెప్పారని అది కూడా చెల్లించక పోవడంతో పండగ పూట కార్మికులు పస్తులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఒకటి, రెండు రోజుల్లో పేమెంట్ల కోసం క్లారిటీ వచ్చే అవకాశం ఉందని కార్మికులకు హామీ ఇచ్చారు.

తాడిని సంధర్శించిన జనవిజ్ఞాన వేదిక నాయకులు

విశాలాంధ్ర-పరవాడ: తాడి గ్రామం చుట్టూ ఉన్న ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో గాలి, నీరు, భూమి కలుషితం కలుషితమై ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో చేపట్టిన పర్యావరణ అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం పరవాడ మండలంలోని పెదతాడి, చినతాడి, తాడి కాలనీ, తానాం గ్రామాలను అనకాపల్లి జిల్లా జనవిజ్ఞాన వేదిక బృందం సందర్శించి ప్రజల అభిప్రాయాలు సేకరించింది. ఈ సంధర్భంగా గ్రామంలోని మహిళలు తమ గోడును విన్నవించుకున్నారు. విపరీత వాయు, జల, భూ కాలుష్యాలు భయం కొలిపే విధంగా ఉన్నాయని ఆంధోళన వ్యక్తం చేసారు. గర్భిణీ స్త్రీలు గర్భస్రావం భయంతో గ్రామంలో ఉండటం లేదని, చిన్నారుల్కెతే శాసకోస, గుండె సంబంధిత వ్యాధుల భారిన పడుతున్నారని, వాటి కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యంతో చర్మ వ్యాధులు ప్రబలడమే కాకుండా ముడుకుల నొప్పులు అధికమవుతున్నాయని తెలిపారు. పాడిపశువుల పునరుత్పత్తి జరగడం లేదన్నారు. కాలుష్యంతో వ్యవసాయం కలిసిరాకపోవడంతో పూర్తిగా పంటలు వేయడం మానేశామని గ్రామస్థులు పేర్కొన్నారు. పండగ నిమిత్తం వచ్చిన ఆడబిడ్డలు కూడా కాలుష్యం వలన ఇక్కడ ఉండడానికి ఇబ్బంది పడుతున్నారని తమ ఆవేదనను వెలిబుచ్చారు. ప్రభుత్వాలు మారినా ఏమాత్రం పట్టించుకోకుండా ఉండటం అన్యాయమని అన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని జనవిజ్ఞాన వేధిక నాయకులు డిమాండ్ చేసారు. ప్రజల జీవన పరిస్థితుల మెరుగుదలకు కాలుష్య నివారణ చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.త్రిమూర్తులురెడ్డి, మారిశెట్టి వెంకట అప్పారావు, బి రామ్ కుమార్, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.5,00,116 లక్షలు విరాళం

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలో శివాలయం పూనఃనిర్మానం జరుగుతుంది. శివాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న విఘ్నేశ్వర ఆలయానికి మండలంలోని రావులమ్మపాలెం గ్రామానికి చెందిన శ్రీ వినాయక బిల్డింగ్ కన్స్ట్రక్షన్ అధినేత గొంప ముత్యాలనాయుడు ఐదు లక్షల నూట పదహారు రూపాయలు ఆర్థిక సహాయాన్ని గురువారం విరాళంగా ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గొంప ముత్యాలనాయుడు కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నాని, దంగేటి ప్రకాశ్, గెద్దం కృష్ణ, కోరాడ శ్రీను, బర్ల రమణ, కొల్లి కృష్ణ, బేతిన శ్రీనివాసరావు ,చింతల శ్రీనివాసరావు, చింతల జగన్నాథం, టి శేఖర్, జెట్టి ప్రసాద్, గెద్దం రమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.